# మా ఇంటికి రండి

ఇరవై రెండు సంవత్సరాల తర్వాత భారతదేశం సందర్శించిన బ్రిటీష్‌రాణి ఎలిజబెత్‌టుకి ఆ పర్యటన ఎంతో ఆనందదాయకంగా జరిగిందని ఢిల్లీ విమానాశ్రయంనించి తిరిగి లండన్ వెళ్తూ భారత రాష్ట్రపతితో చెప్పింది. తను ఇదివరకు చూసినప్పటికి ఇప్పటికి దేశం ఎంతో ప్రగతిని సాధించిందని చెప్పింది.

విమానంలోకి వెళ్ళాక బ్రిటీష్‌రాణి భర్త భార్యని నవ్వుతూ అడిగాడు.

"భారతదేశం నిజంగా ఎంతో ప్రగతి సాధించిందా?"

బ్రిటీష్ రాణి చిరునవ్వే సమాధానంగా ఇచ్చి తమ ప్రత్యేక విమానంలోని లగేజ్‌రేక్ నిండా పేర్చబడివున్న నలభై రెండు తోలు పెట్టెల వంక చూసింది.

ఆవిడ భర్త కూడా వాటి వంక చూశాడు.

క్వీన్ ప్రెస్ సెక్రటరీ గుర్తు చేసాడు.

"యువర్ హైనస్ ముప్పై అయిదువేల ముప్పై అయిదువందల ముప్పై అయిదు పుత్తరాలు మొత్తం"

అంతకు కొన్ని రోజుల ముందు తమ పర్యటనలో భాగంగా బ్రిటీషు రాణి ఆంధ్రప్రదేశ్ రాజధానిని కూడా సందర్శిస్తుందని పేపర్లో ప్రకటించారు.

వారా పత్రికలోని ఆవార్త చదివిన జంట నగరవాసుల్లో కొందరు తమనించి అనేక చెక్కుల రూపంలో పిండుకున్న ధనం. అలా వృధా అవుతున్నందుకు చింతించారు.

"భారతదేశానికి బానిసత్వభావాలు ఇంకా పోలేదని" పాఠకుల పుత్తరాల శీర్షికలో అనేక పుత్తరాలు ప్రచురింపబడ్డాయి. ఆఫీసుల్లో కూడా ఉద్యోగులు ఇదే చర్చించుకున్నారు.

రాణి రావడంవల్ల తమకి మంచి జరుగుతోందని కొందరు ముందే పసికట్టేసారు.

బ్రిటీష్ రాణి విమానం ఢిల్లీలో దిగింది. ఢిల్లీలోని తన అతిథి గృహానికి చేరుకున్న రాణికి ఎంతో ఆశ్చర్యం కలిగించే సంఘటన ఎదురైంది

ఇరవై ఏడు వేల నాలుగు వందల అరవై మూడు ఉత్తరాలు ఆమె కోసం ఎదురుచూస్తున్నాయి. బ్రిటీష్ ఎంబసీలోని కొందరు ఉద్యోగులని వాటిని చదవడానికి ప్రత్యేకంగా నియమించాల్సి వచ్చింది. అన్ని ఉత్తరాల్లోని సారాంశం దాదాపుగా ఒకటే.

"ఇరవై రెండు సంవత్సరాల తర్వాత మా దేశానికి మళ్ళీ వచ్చే మీకు మా హృదయపూర్వక స్వాగతం. మావూరు ఎలాగూ వస్తున్నారు కాబట్టి ఒక్కసారి మా ఇంటికి రండి ఒక్క క్షణం మా ఇంటి ముందాగి మేం ఇచ్చే టీ తాగి వెళ్ళండి మా కోరిక తప్పక మన్నించాలని సవినయంగా కోరుతున్నాం"

ఆ ఉత్తరాలన్నీ జంట నగర వాసులనించే రావడం రాణిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. తనని అభిమానించే వారు తెలుగు దేశంలోని ప్రజలే అవటం ఆవిడకి ఎంతో విచిత్రంగా అనిపించింది. ఆ రోజు పోస్ట్‌లో మరో నాలుగువేల రెండు వందల పదహారు ఉత్తరాలు మా ఇంటికి రండి" అని ఆహ్వానిస్తూ వచ్చాయి. జంటనగరాల్లోని వివిధ కాలనీలలోని వెల్‌ఫేర్ కమిటీలనించి ఐ ఏ ఎస్ ఆఫీసర్స్ లాంటి అధికారులనించి, పారిశ్రామిక వేత్తలనించి, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ప్యూన్‌లనించి పోస్ట్ మేన్‌లనించి....దాదాపు అన్ని మతస్థులనించి, జంటనగరాలలోని అన్ని ప్రాంతాలనుంచి "మా ఇంటికి రండి" అని ఆహ్వానిస్తూ ఉత్తరాలు వచ్చాయి.

హైద్రాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగిన క్వీన్‌కి ఆశాభంగమే కలిగింది. కొన్ని లక్షల మంది తనని చూడటానికి వస్తారనుకుంది ఆవిడకి ఉత్తరాలు రాసిన వాళ్ళలో ఒక్క శాతంజనంకూడా రాలేదు.

ఈ విచిత్రం ఏమిటో కనుక్కోవాలనే ఆసక్తి రాణికి కలిగింది. తన రక్షణ నిమిత్తం వచ్చిన స్కాట్‌లెండ్‌యార్డ్‌లోని మేటి సి. ఐ. డి. లకి సంగతి చెప్పి తనకి జంట నగరాలనించే తమ ఇళ్ళకి ఆహ్వానిస్తూ వుత్తరాలు రావడంలోని మిస్టరీని కనుక్కోమని కోరింది.

స్కాట్‌లెండ్ యార్డ్‌లోని అత్యంత ఘంత అయిన డిటెక్టివ్ కూడా ఆ సంగతి తేలికగా కనుక్కునేంత చిన్న విషయం అది.

డిటెక్టివ్ జాన్ క్రఫోర్డ్ ఆ రాత్రి రాణిని కలిసి చెప్పాడు.

"యువర్ హైనస్. మీ మీద అభిమానంతో కాక తమ సౌకర్యం కోసం హైదరాబాద్ పౌరులు మిమ్మల్ని ఆహ్వానించారు"

రాణికి అర్థం కాలేదు.

మరేంలేదు మీరు వాళ్ళ ఆహ్వానాన్ని మన్నించి వారింటికి వెళ్తే వాళ్ళ ఇంటి ముందు ప్రభుత్వం వెంటనే రోడ్డు వేస్తుందనే ఆశలో వారు మిమ్మల్ని ఆహ్వానించారు.

"ఈ వూళ్ళో రోడ్లున్నాయే?" రాణి ఆశ్చర్యంగా అడిగింది.

"యువర్ హైనస్ మీరు వస్తున్నారని తెలిసి, మీరు ప్రయాణించే మార్గంలో రోడ్లు ఇటీవలె వేయబడ్డాయి. మిగతా చోట్ల రోడ్లు వేసి చాలా కాలం అయింది ప్రస్తుత ప్రభుత్వం పిసినారి ప్రభుత్వం అని భావిస్తున్నారు ప్రజలంతా రోడ్లు వేయడానికి ధనాన్ని విడుదల చేయడానికి ముఖ్యమంత్రి సుముఖంగాలేరని ప్రజలనుకుంటున్నారు."

ఆ వుత్తరాలన్నీ బ్రిటీష్ క్వీన్ సొవనీర్‌గా తన దేశానికి తీసుకెళ్ళడానికి వెంటనే నిర్ణయించుకుంది.